# సింగరేణికి కొత్త గనులు కేటాయించాలి

**12వ వేజ్‌బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసీ**
**డిమాండ్లు నెరవేర్చకుంటే ఆగస్టులో సమ్మె హెచ్చరిక**



**అగ్ని ధారా న్యూస్,( రామగుండం):**

సింగరేణికి కొత్త బొగ్గు గనులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థ నష్టపోతోందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని ఓసీపీ-5 వద్ద గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించే విషయంలో గతంలో ఏఐటీయూసీ తొలి ఉద్యమాన్ని చేపట్టి అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించకుండా ప్రైవేటు సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని విమర్శించారు. సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ సంస్థ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. తెలంగాణలో గుర్తించిన అన్ని బొగ్గు బ్లాకులను వేలం ప్రక్రియకు దూరంగా ఉంచి నేరుగా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. 2015లో అమల్లోకి వచ్చిన ఎంఎండీఆర్ చట్టం కారణంగానే సింగరేణికి కొత్త గనులు దక్కడం లేదని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యానికి 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చామని, ఇప్పటికే రెండు విడతల చర్చలు జరిగినప్పటికీ స్పష్టమైన హామీలు లభించలేదన్నారు. ప్రధాన డిమాండ్లైన కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, 12వ వేజ్‌బోర్డు ఏర్పాటు, నాలుగు లేబర్ కోడ్ల రద్దు, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిల విడుదల, ఆదాయపన్ను రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారం, మెడికల్ బోర్డు కొనసాగింపు, సొంతింటి పథకం అమలు వంటి అంశాలపై ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. డిమాండ్ల పరిష్కారంలో జాప్యం కొనసాగితే ఆగస్టు నెలలో ఇతర కార్మిక సంఘాలతో కలిసి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి సింగరేణి పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ఏఐటీయూసీ ఓసీపీ-5 ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్ అధ్యక్షత వహించారు. ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడారు. నాయకులు మాదన మహేష్, బోగ సతీష్‌బాబు, గండి ప్రసాద్, ఎడవెల్లి రాజిరెడ్డి, సదయ్య, ఉదయభాను, రవీందర్, నర్మద, అంజన్న, మడ్డి కిరణ్, పాపన్న, పరుశురాం, శ్రీనివాస్, సురేష్, పర్లపెల్లి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నాగేపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

**70 మందికి కంటి పరీక్షలు.. 30 మందికి ఉచిత శస్త్రచికిత్సకు ఎంపిక**




**అగ్ని ధార న్యూస్ (రామగిరి):**

రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ, కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో, గొల్లపల్లి రాయమల్లు తన సతీమణి కీర్తిశేషులు రమాదేవి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ అధ్యక్షురాలు డాక్టర్ శరణ్య యాదవ్, రేకుర్తి కంటి ఆసుపత్రి టెక్నీషియన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో మొత్తం 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 30 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. ఎంపికైన రోగులను ఉచిత బస్సు సౌకర్యంతో కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించి, వారికి పూర్తిగా ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రోగులకు ఉచిత రవాణా, భోజనం, మందులు, లెన్స్‌లు, శస్త్రచికిత్స అనంతర వైద్య సేవలను కూడా ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరణ్య యాదవ్ మాట్లాడుతూ, ప్రియమైన వారి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించడం వారికి అందించే ఉత్తమ నివాళి అని అన్నారు. గొల్లపల్లి రాయమల్లు రమాదేవి స్మారకార్థం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మరిన్ని సేవా కార్యక్రమాలను లయన్స్ క్లబ్ ద్వారా నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కమిటీ చైర్మన్ మేకల మారుతి యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ ఎల్లా రామ్మూర్తి, మాజీ ఎంపీపీ ఆరెల్లి కొమురయ్య, సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ యాదవ్, మాజీ సర్పంచ్ ఎరుకల ఓదెలు, ఉప సర్పంచ్ యసం సతీష్, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు తీగల సదయ్య, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు వేగోళపు సంతోష్, యూత్ ఉపాధ్యక్షుడు నాడెం శ్రీనివాస్, భద్రపు శ్రీనివాస్, మైలారం అనిల్, పందుల సోము, రామిని గోపాలకృష్ణ, వేగోళపు రాయమల్లు, మంతిని వెంకన్న, మంతిని లచ్చన్న, నల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు, రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్య బృందం, గొల్లపల్లి రాయమల్లు కుటుంబ సభ్యులను గ్రామస్థులు అభినందించారు.

# శాశ్వత పరిష్కారానికి భూ సర్వే

**రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.**
**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీగా భూముల సర్వే.**
**రైతులు రీ-సర్వేకు అందుబాటులో ఉంటూ సహకరించాలి.**





**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జూలై-16**

భూ భారతి కింద చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభ లో భూభారతి -- రీ-సర్వే అవగాహన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్ ద్వారా ఇప్పటికే అనేక భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. భూముల విస్తీర్ణంలో తేడాలు, ఇతర భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రీ-సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో చివరిసారిగా 1937లో భూ సర్వే జరిగిందని, ప్రస్తుతం ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సమగ్ర రీ-సర్వే నిర్వహించాలని ఆదేశించిందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం 190 రెవెన్యూ గ్రామాలు ఉండగా, మొదటి దశలో 70 గ్రామాలను రీ-సర్వే కోసం ఎంపిక చేసినట్లు , అందులో సబ్బితం గ్రామం కూడా ఒకటని పేర్కొన్నారు. రీ-సర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, అనంతరం ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులు, వ్యవసాయ భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియను ఆధునిక యంత్రాల సహాయంతో పూర్తి స్థాయిలో నిర్వహిస్తామని వెల్లడించారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి ప్రజలకు 21 రోజుల గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వే ద్వారా 99 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. గ్రామాల్లో రీ-సర్వే జరుగుతున్న సమయంలో ప్రజలు అందుబాటులో ఉంటూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. రోజుకు సుమారు 40 నుంచి 50 ఎకరాల వరకు సర్వే నిర్వహిస్తామని, ఏ భూములను సర్వే చేయనున్నారనే సమాచారాన్ని ముందుగానే అందిస్తామని, సంబంధిత రైతులు నిర్దేశిత సమయంలో తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. రీ-సర్వే ద్వారా రూపొందించే భూ వివరాలు రాబోయే 60 నుంచి 70 సంవత్సరాల వరకు ఉపయోగపడేలా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఆధార్ తరహాలో భూధార్ కార్డుల జారీకి ఈ రీ-సర్వే కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజయ్య, సర్పంచ్ నూనె సరోజన, సర్వేయర్ లు,రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలతో రైతులకు తీరని కష్టాలు

**నాట్ల సీజన్‌లో నిరంతర సరఫరా లేక పంటలపై ఆందోళన**
**ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని రైతుల విజ్ఞప్తి**

**అగ్ని ధార న్యూస్,( పెద్దపల్లి):**

వర్షాభావం, విద్యుత్ అంతరాయాలతో పెద్దపల్లి జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో చెరువులు ఎండిపోగా, బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు ప్రస్తుతం విద్యుత్ కోతలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

నాట్ల సీజన్‌లో వ్యవసాయానికి అత్యంత కీలకమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పొలాలకు నీరు అందించడం కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎంతసేపు ఉంటుందో తెలియని పరిస్థితుల్లో రాత్రింబవళ్లు మోటార్ల వద్దే కాపలా కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క మడి కూడా పూర్తిగా తడపలేని పరిస్థితి నెలకొనడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాభావంతో ఇబ్బందులు పడుతున్న తమకు విద్యుత్ అంతరాయాలు మరింత భారంగా మారాయని, సాగు కోసం చేసిన పెట్టుబడులు వృథా అయ్యే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని విద్యుత్ శాఖ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిర్ణీత సమయాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నంచర్ల గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ



(ఎస్ఐఆర్) కార్యక్రమంలో బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలు చురుకుగా పాల్గొంటున్నారు.

**అగ్నిధార న్యూస్‌మహమ్మదాబాద్ :**

మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలు చురుకుగా పాల్గొంటున్నారు. బీఎల్‌వోలు భార్గవి, మణెమ్మ, మౌనిక, గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.శ్యామ్‌తో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలను నింపించడంలో సహకారం అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఫారాల ప్రాధాన్యతను వివరించడంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలపై అవగాహన కల్పిస్తూ, ఫారాలను సక్రమంగా నింపేలా మార్గనిర్దేశం చేస్తున్నారు. ఎవరూ ఈ ప్రక్రియకు దూరం కాకుండా ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఫారాల సేకరణను వేగవంతం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలు తిరుమల్ రెడ్డి, ఈసా బస్రవి, జి.లక్ష్మీకాంత్ రెడ్డి బీఎల్‌వోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేస్తున్నారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు

## గండీడ్‌లో పట్టపగలే దొంగతనాలు

## బంగారం, వెండి, నగదు అపహరణ

**అగ్నిధార న్యూస్‌మహమ్మదాబాద్ /గండీడ్:**



మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రంలో పట్టపగలు చోరీ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలు, నగదు, మొబైల్ ఫోన్‌ను అపహరించుకెళ్లారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండీడ్ మండల కేంద్రానికి చెందిన సంద్రస్ వెంకట రాములు గౌడ్ ఇంట్లో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లోని బీరువాను తెరిచి సుమారు ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, 27 తులాల వెండి వస్తువులు, రూ.30 వేల నగదు, ఒక మొబైల్ ఫోన్ దొంగిలించి పరారయ్యారు. కుటుంబ సభ్యులు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో సామగ్రి చెల్లాచెదురుగా కనిపించడంతో చోరీ జరిగిన విషయం గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడు వెంకట రాములు గౌడ్ భార్య యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## జూలై 18 జనజాగరణ యాత్ర ను విజయవంతం చేయండి




**అగ్నిధార న్యూస్‌మహమ్మదాబాద్:**

టి ఎస్ సి పి ఎస్ ఈ యు రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థిత ప్రజ్ఞ ఆధ్వర్యంలో 11 జూలై నాడు ప్రారంభమైన జనజాగరణ యాత్ర మహబూబ్ నగర్ జిల్లాలోకి 18 జూలై నాడు చేరుకుంటుందని జిల్లా అధ్యక్షులు కె.యం.చంద్రకాంత్ తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలో మొదటగా జడ్చర్ల నియోజకవర్గంలోని ఉద్యోగ ఉపాధ్యాయులతో కలిసి జడ్చర్ల నియోజకవర్గ శాసనసభ్యులు కి పాత పెన్షన్ పునరుద్ధరణకై వినతి పత్రం సమర్పించి అక్కడి నుంచి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో అమరవేరులస్థూపం నుండి అంబేద్కర్ కళాభవన్ వరకు ర్యాలీ అక్కడే సభ నిర్వహించి అక్కడి నుండి గౌ మహబూబ్ నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు కి వినతి పత్రం సమర్పించి అక్కడి నుంచి గౌరవ దేవరకద్ర శాసనసభ్యులు సభ్యులు ని కలిసి వినతి పత్రం సమర్పించే కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొని పాత పెన్షన్ విధానం పట్ల ఉన్న వ్యతిరేకతను మరొకసారి ప్రభుత్వానికి తెలియజేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరింప చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాఘవేందర్ రెడ్డి,కోశాధికారి రాగవేంద్ర,ఉపాధ్యక్షులు మల్లేష్,జిల్లా బాధ్యులు ఖాదర్,భాస్కర్ రెడ్డి,కృష్ణారెడ్డి,బూత్పూర్ మండల అధ్యక్షురాలు సునీత, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు లక్ష్మయ్య,కూర్మయ్య,రాఘవేందర్,బుచ్చన్న,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కొర్ర చందర్ కుటుంబానికి న్యాయం చేయాలి

**కారుణ్య నియామకం, ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్**

**అరకులోయ :** అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకులోయ మండలం, మాదాల గ్రామ పంచాయతీ పరిధిలోని ముసిరిగూడ గ్రామానికి చెందిన ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ( ఏపీఎండిసి )ప్రధాన కార్యాలయం, విజయవాడలో ట్రైనీ ఉద్యోగిగా దాదాపు 20 సంవత్సరాల పాటు సేవలందించిన కొర్ర చందర్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందడం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని టీఆర్ హెచ్ఆర్, ఏసీఏ సౌత్ ఇండియా జాయింట్ సెక్రటరీ, అరకులోయ మండల చైర్మన్ వంతల ప్రసాద్ రావు ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. అనంతరం కొర్ర చందర్‌కు ఘనంగా నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వంతల ప్రసాద్ రావు మాట్లాడుతూ, రెండు దశాబ్దాల పాటు ఏపీఎండీసీ అభివృద్ధికి అంకితభావంతో సేవలందించిన కొర్ర చందర్ శాశ్వత ఉద్యోగం కోసం ఎదురుచూస్తూనే మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న ఆయన మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆర్థిక, సామాజిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

